ప్రేమజ్యోతికి క్రీనీడ వుంటుందా?

రచయిత :
కొత్తపల్లి శ్రీ రామమూర్తి, యల్. యమ్. ఇ.

సంధ్యాసమయం. బీచి కిటకిటలాడిపోతోంది. రేడియోలో ఎవరో తెనుగు గాయకి కాబోలు జావళీ విసురుతోంది. ఆమె కంఠ మాధుర్యానికి తమిళ సోదరులు తన్మయులై తాళంవేస్తూ ఊహూఁ పూగిసలాడి పోతున్నారు. ఆ కంఠ మాధుర్యాన్ని గ్రోలిన కొందరు యువకులు ఆమె రూపం ఎంత...గా వుంటుందో అని కలలు గంటున్నారు.

ఆసమయంలో ఇందిర చంటిబిడ్డను ఎత్తుకుని హంసగమనంతో మూర్తివెంట నడుస్తున్నది, యిసుకలో. ఆమె హటాత్తుగా ఆగిపోయింది సింహాన్ని చూసిన లేడిలాగు బెదురు చూపులతో.

ఇంతలో రామారావు కమలతో కలిసి యిటే వస్తున్నాడు. 'ఏం, అల్లా నిలిచిపోయావ్!' అన్నాడు మూర్తి వెనక్కు తిరిగి చూస్తూ. ఆమె వూరుకుంది. "పిల్లవాణ్ణి ఇలా ఇయ్యి. కాస్సేపు నేను ఎత్తుకుంటాను" అని వెనక్కి రెండడుగులు వేసి ఆమె చంకని వున్న కృష్ణుణ్ణి చటాల్న లాక్కున్నాడు మూర్తి. దీర్ఘమైన నిట్టూర్పు విడిచి, పమిట సర్దుకుని నడవ సాగింది ఆమె. హృదయభారంతో తల వాలిపోయింది. అప్పటి ఆమె స్థితి...?

రెండడుగులు ముందుకి వేసేసరికి నమస్కారబాణం వేస్తూ 'మూర్తీ! సౌఖ్యమా!' అంటూ పలకరించాడు రామారావు. 'ఏదో మీదయవల్ల' అన్నాడు మూర్తి.

"ఎంత మాటన్నారు పెద్దలు, మమ్మల్ని అలా అనొచ్చా" అంటూ, "మీ అబ్బాయేనా!" అని కృష్ణుణ్ణి ఎత్తుకుని ముద్దు పెట్టుకుని భార్యకిస్తూ—"అంతా వాళ్ళ అమ్మగారి పోలికే" అన్నాడు చటుక్కున—సిగ్గుతో వెనక్కు నుంచున్న ఇందిర వేపు ఓరగా చూస్తూ.

'అదృష్టవంతుడు!' అని శిరం మూర్కొని హృదయానికి హత్తుకొన్నది పుత్రప్రేమను ఒలికిస్తూ, కమల. కొంటె కిష్టుడు ఆమె మెళ్ళోని హారాలు సవరించడం మొదలుపెట్టాడు.

'ఊఁ హూఁ!' పేరు పూరి కేపోతుందా! అంటూ బుగ్గలు చిదిమింది మందహాసంతో కమల. వాడు కేరుమన్నాడు. పిల్లవాని ఆర్తనాదం వినబడగానే చివాల్న ఆమె చేతినుండి లాక్కొని వెనక్కి తిరిగింది ఊరుకోబెట్టడానికి. ఆమె సిగ్గు ఎక్కడికి పోయిందో యేమో! రామారావువంక కన్నెత్తి చూడడానికయినా ఆమెమనస్సు అప్పుడు అంగీకరించలేదు. కాని, అతన్ని చూచినప్పుడల్లా ఆమె చిన్ననాటి చేష్టలు జ్ఞప్తికి రాగా, మెఱుపుదెబ్బతిన్నట్టు అనిపించేది. స్త్రీపురుష బేధంలేకుండా గడచిన ఆరోజులు ఆమెకు స్వప్నప్రాయంగా తోచినవి. ఆ స్ఫురణతో హృదయభారం అధికమయింది.

కాస్సేపు పిచ్చాపాటీ ముచ్చటించుకున్న తరవాత రామారావు కమలా వెళ్ళిపోయారు. రామారావు వున్నంతసేపు యిందిర పడ్డ కలవరపాటు మూర్తి గుర్తించక పోలేదు. పులివాతనుండి తప్పించుకున్న లేడి చందమైంది ఇందిర స్థితి. కొంచంసేపటికి సేద తీర్చుకుంది.

రామారావు ఉదంతం మూర్తికి పూర్తిగా తెలియదు. రామారావు మొదటిసారి ఇందిర పెళ్ళికి కనుపించాడు. అంతే.

అతని సంగతి తెలుసుకోవాలనే కుతూహలమే లేదు మూర్తికి. కాని భార్య కలవరపాటు చూస్తే అతనిసంగతి తెలుసుకోవాలని బుద్ధి పుట్టింది.

కాని అక్కడ ఎదటనే అడిగితే తను అనుమానపడ్డారని అనుకుంటుందని ఏమీమాటాడకుండా కాస్సేపు ప్రకృతి శోభను చూస్తూ ఆనందించి ఇంటికి చేరుకున్నారు.

భోజనాలయాక డాబామీద వెన్నెట్లో పక్కవేసుకొని కూచుని తమలపాకుల చిలకలు చుట్టి యిస్తోంటే వేసుకుంటూన్నాడు. 'నిన్ను అడగాలని ఎన్నోసారులు అనుకున్నానుగాని, జ్ఞాపకం వుండేదికాదు. కనపడ్డప్పుడల్లా పలుకరిస్తాడు ఆ రామారావు ఎవరితాలూకు.' అని అతి తాపీగా అన్నాడు లోపలి అనుమానాన్ని కప్పిపుచ్చుతూ. ఇందిర కొంతసిగ్గుతో చెప్పడానికివెరచి తటపటాయించి దాచడంవల్ల యీదుడుకు యిలాగా వుండిపోతుందని ధైర్యం చేసి చెప్పింది యిట్లా. 'అతంది మావూరేనండి. నేనూ అతడు చిన్నప్పుడు ఒక బళ్లోనే చదువుకునేవాళ్ళం. అతని చెల్లెలూ నేనూ ఒకక్లాసులో చదువుకున్నాం. ఆఅమ్మాయీ నేనూ ఆడుకుంటూ వుండేవాళ్ళం. వాళ్ళింటిదగ్గర...'' అని అతి ఆయాసంతో చెప్పింది. యిక నాలిక మెదిలిందికాదు, కాని అతన్నిగురించి తలుచుకునేసరికి విసుపు కలిగింది. ఎందుకో ఆమెకూ తెలియదు. ఇంక చెప్పడానికి ఇష్టంలేక మౌనం వహించింది.

ఆవలిస్తే పేగులు లెక్కించే మేధావంతుడు మూర్తి. అంతా అర్థమైంది. 'బాల్యస్నేహితుడు బంధువులకన్నా అప్తులన్నారు యిందుకే.' అంటూ ఆమె యిచ్చే చిలకలు అందుకుంటూ చేయి గట్టిగా పట్టుకున్నాడు. చేయిపట్టుకోగానే సిగ్గుచే వరిగిపోయింది అతనినివళ్లో.

... ...

ఇందిర సంపన్నగృహస్థుని ఏకైక పుత్రిక. తండ్రి సుందర్రావు. తల్లి శేషమ్మ. ఒక్కగానొక్క కూతురవడంవల్ల అందులో వాళ్ళ ప్రేమకు తొలిఫల మగుటవల్ల ఆ పిల్లను అల్లారుముద్దుగా పువ్వుల్లో పెట్టి పెంచారు. అయిదోయేడు రాగానే బళ్ళో వేసారు. దినదినాభివృద్ధిగా, పెరుగుతోంది శుక్లపక్షచంద్రునివలె. ఆమె వయస్సుతో కూడా పెరిగింది పెంకితనం. ఆమెకు పన్నెండేళ్ళు నిండాయి.

తారామనోహరుని కైనా కళంకం వుందేమోకాని ఆమె ముఖ కమలానికి కళంకమే లేదు. ఆమె ముంగురులు ఆమె ముఖసరోజం మీాద చిందులాడుతూవున్నాయి పద్మంలోని మధువుకై ప్రాకులాడే కొదమ తుమ్మెదలాగ. కంఠమెత్తితే భువనమోహనంగా పాడే కోకిలకూడా సిగ్గుచే తొలగిపోతుందామెముందు మేని ఛాయ పండ్రెండోవన్నె బంగారంలావుంటుంది. ఆమె కనుబొమ్మలు కాముని శరాసనంలా వున్నాయి. యవ్వనం ఆమె అవయవాల్లో ప్రస్ఫుటంగా వ్యక్తమౌతోంది. ఆమె తేనెలొలుకు పలుకులు విన్నవారందరు తన్మయత చెందుతారు.

ఆమె అభమూ శుభమూ తెలియని అమాయకురాలు. ఆమె లావణ్యానికి తగిన నాజూకు, నాజూక్కి తగిన విద్యా, విద్యకు తగిన వివేకం వున్నాయి. మొత్తంమీాద కారుమెఱుగులలో ఆమె మెఱుగు తీగ అని చెప్పవచ్చు.

ఆమె బడిలో చదువుకుంటూ వుండేది. చదివేది అయిదోక్లాసు. ఆమెకు మాలతి అనే స్నేహితురాలు వుండేది. ఆ స్నేహితురాలుతో తరచు వాళ్ళయింటికి పోయేది ఆటపాటలకు. మాలతికీ ఇందిరకూ గాఢమైన నేస్తం అన్నం తినటమే తడవు, వాళ్ళయింటికి పొట్టిపిచికిలా పారిపోయేది ఇందిర.

మాలతిది పెద్దభవనం. ముందు దొడ్డిలో మల్లెపందిరి వుంది. పెరటి దొడ్డిలో చామంతి జాజి సంపెంగ మాలతీమాధవం రాధామనోహరం మొదలైన పుష్పజాతులు అనేకం వున్నాయి. మాలతీ ఇందిరలు పువ్వులన్నీ కోసికొని జెడలనిండ తురుముకుని రంభా ఊర్వశీలకు

మళ్లీ తయారయేవారు. మాలతి ఇందిరకన్నా రెండేళ్ళు పెద్ద ఆమె నిండుజవ్వనే కాని పెండ్లికాలేదు. ఆమెకు రామారావు. ఆనందరావు అని యిద్దరు అన్నలు.

రామారావు యుక్తవయస్కుడు ప్రపంచాన్నంతా ఉర్రూతలూగించే ప్రణయవాహిని ఒడ్డున కొట్టుకుపోవుటకు సిద్ధంగా వున్నాడు. అతని కంటికి ఇందిర నావలా కనుపించింది. నిత్యము అతని ఎదుట నాట్యం చేస్తున్న ఆ కనకపు బొమ్మ అతన్ని ముగ్ధుణ్ణిచేసింది

అరిటాకు ముల్లుమీద పడ్డా ముల్లు అరిటాకుమీదపడ్డా అరిటాకుకే మోసం. ఏవిధంగానైనా ఆమెను వశంచేసుకోవాలని సంకల్పించుకున్నాడు. ఆమె ఉత్తమజాతిస్త్రీ అనీ అందని ద్రాక్షపండనీ దృఢంగా తెలిసినా, ఆమె అనురాగానికి పాత్రుడు కావాలని ప్రాకులాడాడు. సంధానానికి చెల్లెలను ప్రోత్సహించాడు. తన చెల్లెలితో కలసి ఆటపాటలు ఆమెతో ఆడడం ప్రారంభించాడు. ఆటల్లో ఆమెను స్పృశించి ఆనందించేవాడు. అతని స్పర్శ ఆమెకు చక్కిలిగింతలు పెట్టినట్టు వుండి ఏదో తెలియని ఆనందం పొందేది.

కాకిగూటిలో పెరిగే కోకిల పిల్లకి కాకికూతే గొప్పగా వుంటుంది. కాని తను కాకివలె కూయాలనుకుని కూయబోయినప్పుడే కదా తన కంఠమాధుర్యం తెలిసేది. ఇందిరకు రామారావు తీసే కూనిరాగాలమీద అభిమానం కలిగింది. వాళ్ళయింటికి వెళ్ళినప్పుడల్లా 'ఏమో, ఒకపాటపాడవో' అని ప్రాధేయపడేది. చక్కని చుక్క పాడమని ప్రాధేయపడితే వెనుదీసే మొగాడు ఎవడుంటాడు! పాడమని అడగటమే తరువాయిగా 'భల్! మోహనరంగా, నీకు నాకు జోడుఅయితే మల్లిపూల తెప్పగట్టి తేలిపోదముగదరా,' అన్న పాట పాడేవాడు.

స్నేహము

ఆపదలయందు స్నేహమే ఆదరించు,
కష్టకాలాన మిత్రుడు కరుణ చూచు,
సుఖము చేకూర, కుంద్రియు సౌఖ్యమందు,
నిటులనే స్నేహ మెపుడును నిడ విధము
బరగు కష్ట సుఖములందు పాలుగొంచు.

అరయ సాంగత్యమున సద సత్తు నిర్ణ
యాన, మన యంతరంబులే మంచిసాక్షి
కాని మైత్రియు దూపింప కానిదగును
దుష్ట బుద్ధియె మనుజుని దుష్టతయను.

కలరు మిత్రులు మనకు కరవు దీర :
మైత్రి యనపేర నెందరో మంత్రగాళ్లు!
చింత నేపలు గలసిన వింత లేదు :
ఈత పోటులు గెలయుట యిలను గలదె?

—పిల్లలమర్రి వేంకట హనుమంతరావు.

పాటమాధుర్యానికి తోడు అతని పలుకు యింపు సొంపులు అతీతం అదిగాక పువ్వుబోడుల హృదయకమలములను వికసింపచేయగలది ఒక్క మధురవాక్కే. తీయని వాక్సుధారసం చిలికించేవారికి మగువ అరచేతిలోని ఆమలకము. మంత్రిదష్టమైన పన్నగము స్త్రీని మెప్పించాలంటే ఆమెతో తీయని సరసాలాపములు ఆడటమే ఎన్ని భూషణాలుపెట్టిన మగడు ఎంత అందగాడైనా ఆమెకు అవి అన్ని తృణప్రాయమే. ఆమె అందచందాలు కొనియాడుతూ తీయగా మాటలు

చెప్పే వానికి ఆమె హృదయమును అర్పిస్తుంది.

పుట్టుకతోనే ఈరహస్యం తెలిసికొన్న రామారావు ఉబ్బించేవాడు. ఆమె సౌందర్యానికి ఫ్యూరికే పొగిడే వాడు. అతని పొగడ్తలకు మురిసిపోనివారు మానవుల్లో వుండరు. అందులోను స్త్రీలను చెప్పాలా! ఉబ్బేస్తే ఎంతపనేనా చేస్తారు.

పాటలలోను ఆటలలోను మునిగి తేలే ఆ ఇందిర ప్రపంచాన్ని మరిచిపోయింది.

ఉషఃకాంతులకు అరవిచ్చిన పద్మంలాగ ఆమె నిర్మలహృదయం వికసించింది. మధువుకై కాచియున్న మధుపము ఝుమ్మని పద్మగర్భంలో చేరినట్టు, ప్రపంచమే ఆటపాటలుగా భావించిన ఆ లేత హృదయం చెలికత్తె ప్రోత్సాహముమీద అతనిమీద నాటుకుంది. ఆ సంగతి ఆమెకు తెలియదు. పొంగి పొరలివచ్చేనది తను సముద్రములో చేరితే తన సహజమాధుర్యం కోలిపోతాను అనుకుంటుందా? మా అన్నయ్యని చేసుకో ఇందిరా. నువ్వూ నేనూ ఒకచోట వుండచ్చు అంటే తెలియని స్థితిలో 'ఊఁ' అనేసింది. చంద్రముఖి నాచేత చిక్కినదికదా అని మురిసిపోయాడు రామారావు.

కాలపురుషునికి యువతీ యువకులమీద అపరిమితమైన కసి. కాగా, కాలం తారుమారుచేసాడు. వారి అన్యోన్యతకి భంగం కల్పించాడు విధి. మాలతి పెండ్లి చేసుకొని అత్తవారింటికి పోయింది.

ఎవరోయి?

నాకు తోడెవ్వరోయీ !
నాకు రేడెవ్వరోయీ ?

కటికి చీకటి
కాటి కాపరి
భీతిగొలిపే
బ్రహ్మరాక్షసి!

నాకు తోడెవ్వరోయీ !
నాకు రేడెవ్వరోయీ ?

విరహ తాపం
వేడిగాడ్పులు
రెచ్చగొట్టే
రమణి రూపం!

నాకు తోడెవ్వరోయీ !
నాకు రేడెవ్వరోయీ ?

స్వార్థజీవులు
వర్ధించెన
కొట్టుకెళ్ళే
కాలవాహిని!

నాకు తోడెవ్వరోయీ !
నాకు రేడెవ్వరోయీ ?

పిల్లలమఱ్ఱి
వేంకటహనుమంతరావు.

స్త్రీలు ఎప్పటికైనా మగవారిసొత్తేకదా. ఎంత స్వేచ్ఛాజీవులైనా మగవానికి లోకువే కదా!

ఇందిర పుష్పవతి అయింది.

తలి తండ్రులు చదువు మానిపించి పెండ్లి ప్రయత్నాలు సాగించారు. ఎన్నో సంబంధాలు వచ్చాయి. అయ్యమ్మకి నచ్చలేదని అమ్మమ్మకి నచ్చలేదని అన్నీ తిరగొట్టేసారు. తుదకి మూర్తి వెళ్లాడు. అంతా ఘటన. ఏంచెప్పను.

పెళ్ళితీరులు ఆపిల్లకు నచ్చలేదు రామారావుని చేసుకుంటే బాగుండునని హృదయంలో వాంఛ. కాని పాత ఒక రోతను పుట్టించునన్న వివేకం ఆమెకు ఎక్కడిది! దిగిన తరువాత కదా, లోతు తెలిసేది. ఏమీ చెప్పలేక మౌనంతాల్చింది. హృదయవాంఛను చంపుకుంది.

కన్నీటితోనే భర్తకి తలంబ్రాలుపోసింది. పెండ్లి అయింది, కాపరానికి వెళ్ళింది. ఆ నూతన సంసారంలో వుండగా రామారావుతో గడపిన దినాలు జ్ఞాపకంవస్తే నిశ్చేష్టురాలై నిలువునా నీరైపోతుంది. అనుకున్నవాణ్ణి పొందలేకపోయానుగదా అని హృదయం తహతహపడుతున్నది ఆమెకు. కాని అట్టి భావం లేనట్టుగా నటించాలని నటించలేక బాధపడుతుంది. ఇట్లా కొంతకాలం జరిగింది.

కాని కాలపురుషుడు అనుగ్ర

హిస్తే యవ్వనం శాశ్వతమా— కాపరానికి వెళ్ళిన ఏడాదిలోనే దాంపత్యఫలంగా ఆమెకు తొలి కాన్పు- ఒక కుమారుడు పుట్టాడు!

ఆమెకు యిప్పుడు ఆకుమారుడే సర్వస్వమూను. అతని కరపల్లవములే ఆమె కన్నుల వైకుంఠము. అతడనే 'తాతా' శబ్దమే ఆమెకు భువనమోహన గీతము. అతని తుంపర్లధ్వనే వీణారవములు. ఆమె ప్రేమ హృదయంలో ఆపిల్లవానికి తప్ప ఇతర్లకు తావు లేదు. రామారావును పూర్తిగా మరచిపోయింది ఆచిన్నిబాలుని సేవలో. కాని యిప్పటికికూడా రామారావు కనిపిస్తే బాల్యక్రీడలు స్ఫురణకు వచ్చి భయపడుతుంది శీలానికి లోపం కలిగించేమో అన్న అనుమానంచేత. రామారావు కమలను పెండ్లిచేసుకొని సుఖంగా వున్నాడని తెలుసుకొన్న వెనుక, యువకుల చేష్టలు కామపూరితాలుగాని ప్రేమ పూరితాలు కావని గ్రహించుకుంది.

కామము చీకటిని కోరుతుంది. ప్రేమ వెలుగు నిస్తుంది. అందుకే ప్రేమజ్యోతి అన్నాడు. కాని ప్రతీ దీపానికి కీనీడ వుండునుగాన ప్రేమ స్వచ్ఛతకు కూడా కొంచం లోపముందేమో, దానికి కూడా కామ సంపర్కం వుందేమోనని ఆత్మ పరీక్ష చేసుకొంటూ వుంటుంది. కాని కుమారుడు కలిగాక ఆమెకు యావత్ ప్రపంచం ఆ బాలుని చిరుహాసంలో ప్రత్యక్షమౌతుంది. ఆ పిల్లవానిని ఆమె అక్కున అదుముకున్నప్పుడు ఆమె యీ బాహ్య ప్రపంచాన్నే మరిచిపోతుంది.

పండితులకు మాత్రమే

వాత్స్యాయన కామసూత్రములు

యశోధరుని జయమంగళ వ్యాఖ్యయు, మూలసూత్రములును తేటతెల్లమగు ఆంధ్రవివరణము, విశేషాంశములు, పీఠికతో సహా శ్రీ పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారిచే కూర్పబడిన పెద్దసైజున 800 పుటలుగల గ్రంథము- కామపురుషార్థమును గురించిన అన్ని సంగతులు గలవు.

రెండవ కూర్పు – రు 10–0–0 – పోస్టుఖర్చులు ప్రత్యేకము.

గ్రంథము విలువయును, యోగ్యతయును ఆంధ్రదేశమునందలి ప్రతియొక్కరును ఎఱింగియుండుటచేతను దీనిని గురించి విశేషించి వ్రాయనవసర ముండదు. విద్వాంసులు, భాషాపారిశ్రామికులు, చారిత్రికాన్వేషణము చేయు సజ్జనులు తప్ప ఇతరులకెవ్వరికిని ఎంతమూల్యము నొసంగినను ఈ గ్రంథమును విక్రయించుటగాని, మఱి ఇతరవిధములగాని ఈయము. గ్రంథమును చక్కగా సంరక్షించుకొని దుర్వినియోగమునకుఁ దావీయమని వ్రాతమూలకముగా హామీనిచ్చువారు మాత్రమే ఈగ్రంథము కొఱకై ఆర్డరులను పంపవలెను. పాఠశాలలు, కళాశాలలు మొదలైనవాటిలో చదువు విద్యార్థులును; స్త్రీలును; గ్రంథమునుగాని, గ్రంథస్థములగు విషయములనుగాని సంరక్షణచేసికోఁజాలని ఇతరులును ఈ గ్రంథమునకు ఆర్డర్లు పంపవలదు.

ఆంధ్రభూమి బుక్కుడిపో, వేపేరి, మదరాసు.